నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I హైదరాబాద్, మంగళవారం 14 మే 2024 SIDDIPET



చింతమడకలో ఓటు వేసేందుకు వస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పక్కన హరీశ్‌రావు

# మురిసిన చింతమడక

## గులాబీ అధినేత రాకతో గ్రామంలో పండుగ వాతావరణం

- ఓటు హక్కు వినియోగించుకున్న కేసీఆర్ దంపతులు
- కదిలివచ్చిన గ్రామస్తులు
- ఘన స్వాగతం పలికిన జనం

సిద్దిపేటరూరల్, మే 13: చింతమడక ప్రజలు మురిసిపోయారు. తమ ఇంటి ముద్దుబిడ్డ గ్రామానికి రావడంతో ఆనందానికి లోనయ్యారు. గులాబీ అధినేత కేసీఆర్ తన సతీమణి శోభతో కలిసి సిద్దిపేట రూరల్ మండలం చింతమడక స్వగ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం ఉదయం 11:15 నిమిషాలకు ఎర్రవల్లి నివాసం నుంచి హెలిక్యాప్టర్‌లో ఆయన చింతమడకకు చేరుకున్నారు. హెలిప్యాడ్ నుంచి భారీ బందోబస్తు నడుమ కాన్వాయ్‌లో పోలింగ్ కేంద్రానికి వచ్చారు. కేసీఆర్ రాక విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలింగ్ కేంద్రానికి భారీగా తరలివచ్చారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో పోలీసులు కట్టడి చేయాల్సిన పరిస్థితి వచ్చింది. పోలింగ్ కేంద్రం బయట అప్రమత్తమైన పోలీసులు ప్రజలను నిలువరించారు.

# ఓటే వజ్రాయుధం

## బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

సంగారెడ్డి, మే 13: ఓటు హక్కును వజ్రాయుధంగా భావించి ప్రజాసేవ చేసే మంచి నాయకున్ని ఎన్నుకోవాలని మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం సంగారెడ్డి పట్టణంలోని భారతీ విద్యామందిర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అప్పుడే ప్రజలు అనుకున్న నాయకున్ని ఎంపిక చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. వెంకట్రామిరెడ్డి వెంట బీఆర్ఎస్ నాయకులు కాసాల బుచ్చిరెడ్డి, మామిళ్ల రాజేందర్, జలేందర్, నజీర్ తదితరులు ఉన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సిద్దిపేటలో ఓటు వేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

# పోలింగ్ శాతం పెరిగింది

- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, మే 13: ప్రజాస్వామ్య బలోపేతం కోసం అందరూ ఓటు వేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సిద్దిపేటలోని అంబిటాస్ స్కూల్ 114వ పోలింగ్ కేంద్రంలో హరీశ్‌రావు కుటుంబ సమేతంగా ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ముమ్మురంగా ఓటింగ్‌లో పాల్గొంటున్నారని, గతంలో కంటే పట్టణంలోనే ఎక్కువ పోలింగ్ జరిగిందన్నారు. ప్రశ్నించే గొంతుతో ఉండాలని ప్రజలు ఆలోచిస్తున్నారని, మేధావులు, విద్యావంతులు పోలింగ్‌లో పాల్గొనాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. గత పార్లమెంట్ ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ శాతం పెరుగుతుందన్నారు. ఆయనవెంట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు, మచ్చ వేణుగోపాల్ రెడ్డి తదితర నాయకులు ఉన్నారు.




# ప్రశాంతంగా పోలింగ్

- జహీరాబాద్‌లో మందకొడిగా ప్రారంభమై ఊపందుకున్న పోలింగ్
- మాడ్గిలో ఓటేసిన బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్
- జోగిపేటలో ఓటేసిన మంత్రి దామోదర, నారాయణఖేడ్‌లో ఓటేసిన సురేశ్ షెట్కార్
- పలు పోలింగ్ కేంద్రాల్లో మొరాయించిన ఈవీఎంలు
- మర్వెల్లిలో బీఆర్ఎస్ ఎంపీటీసీపై కాంగ్రెస్ నాయకుల దాడి
- సాయంత్రం 5 గంటల వరకు 72.86 శాతం నమోదు

సంగారెడ్డి, మే 13(నమస్తే తెలంగాణ): చెదురుమదురు ఘటనలు మినహా జహీరాబాద్ పార్లమెంట్‌లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. జహీరాబాద్ పార్లమెంట్‌లో సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరిగింది. సాయంత్రం 6గంటల తర్వాత కూడా పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులుదీరి ఉన్నారు. దీంతో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని 1971 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ ఆ తర్వాత క్రమంగా పుంజుకుంది. ఓటర్లు ఎండను కూడా లెక్క చేయకుండా పోలింగ్ కేంద్రాకొచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నారు. పురుషులతో సమానంగా మహిళలు ఓటింగ్‌లో పాలుపంచుకున్నారు. జహీరాబాద్ పార్లమెంట్‌లో రాజకీయ విశ్లేషకులు అంచనా వేసిన దానికంటే ఎక్కువగా పోలింగ్ నమోదైంది. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని జహీరాబాద్, అందోలు, నారాయణఖేడ్, ఎల్లారెడి, బాన్సువాడ, జుక్కల్, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జహీరాబాద్ పార్లమెంట్‌లో నుంచి మొత్తం 19 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు మిగితా అభ్యర్థులు ఓటుహక్కును వినియోగించుకోవటంతోపాటు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

**మాడ్గిలో ఓటు వేసిన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్**

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎంపీ అభ్యర్థులతో పాటు పలువురు ముఖ్యులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ కుటుంబసభ్యులతో కలిసి ఝరాసంగంలోని కేతకీ సంగమేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం మొగుడంపల్లి మండలం మాడ్గిలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. అనంతరం అనిల్‌కుమార్ లింగంపల్లి(రాయికోడ్), నిజాంపేట, పిట్లం(జుక్కల్), గాంధారి(ఎల్లారెడ్డి), బస్వాపూర్(కామారెడ్డి) పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. మంత్రి దామోదర రాజనర్సింహ కుటుంబసభ్యులతో కలిసి జోగిపేటలో ఓటు వేశారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి నారాయణఖేడ్‌లో ఓటు వేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ఝరాసంగంలో, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ ఈదులపల్లిలో ఓటు వేశారు. మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పోతులబోగూడలో, నారాయణఖేడ్ మాజీఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఖానాపూర్(కె)లో ఓటు వేశారు.

**మొరాయించిన ఈవీఎంలు**

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో పలు చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. దీంతో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆలస్యంగా ఓటింగ్ ప్రారంభమైంది. న్యాల్‌కల్ మండలంలోని మామిడ్గి, ఖాజాపూర్‌లో ఈవీఎంలు మొరాయించాయి. అందోల్ మున్సిపాలిటీలోని 195వ పోలింగ్ కేంద్రం, టేక్మాల్ మండలం పాల్వంచ, 'ఖేడ్'లోని 170 పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించాయి.

**మర్వెల్లిలో బీఆర్ఎస్ ఎంపీటీసీపై దాడి**

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో పలు చోట్ల ఘర్షణలు చోటు చేసుకున్నాయి. అందోలు నియోజకవర్గం పరిధిలోని వట్‌పల్లి మండలం మర్వెల్లి గ్రామంలో బీఆర్ఎస్ ఎంపీటీసీ సంగప్పపై కాంగ్రెస్ నాయకులు మూకుమ్మడిగా దాడి చేసి గాయపర్చారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు కలుగజేసుకుని ఇరువర్గాలను పోలింగ్ కేంద్రం వద్ద నుంచి పంపించి వేశారు. నారాయణఖేడ్ పట్టణంలో ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ సోదరుడు నగేశ్ షెట్కార్ 175వ పోలింగ్ కేంద్రం వద్ద బీజేపీ నాయకులతో ఘర్షణకు దిగి బీజేపీ కార్యకర్తపై చేయి చేసుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీసులు స్పందించి ఇరువర్గాలను చెదరగొట్టారు. సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేశ్ నారాయణఖేడ్ వచ్చి బందోబస్తును పర్యవేక్షించడంతో గొడవలు సద్దుమణిగాయి. కోహీర్, ఝరాసంగం మండలాల్లో అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నాయి.

**జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం**

| అసెంబ్లీ సెగ్మెంట్ | 9 గం. | 11 గం.కు | 1 గం.కు | 3 గం.కు | 5 గం.కు |
|---|---|---|---|---|---|
| జుక్కల్ | 12.58 | 33.62 | 53.62 | 65.84 | 72.91 |
| బాన్సువాడ | 15.71 | 35.05 | 53.59 | 65.80 | 73.99 |
| ఎల్లారెడ్డి | 14.17 | 34.23 | 54.20 | 67.25 | 74.74 |
| కామారెడ్డి | 12.49 | 29.79 | 47.46 | 60.27 | 67.79 |
| నారాయణఖేడ్ | 12.71 | 31.67 | 51.55 | 64.02 | 70.83 |
| అందోలు | 11.48 | 30.48 | 49.14 | 64.94 | 73.69 |
| జహీరాబాద్ | 11.84 | 29.51 | 47.42 | 61.05 | 70.54 |

# చేర్యాలలో ఉద్రిక్తత

## బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల బాహాబాహీ





చేర్యాలలో బాహాబాహీకి దిగుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు

- పోలింగ్ కేంద్రాల వద్ద తోపులాట
- అధికార పక్షంపై మండిపడిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- ఎమ్మెల్యే గోబ్యాక్ అనడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన గులాబీ శ్రేణులు

చేర్యాల, మే 13: సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలోని బాలికల పాఠశాల, పెద్దమ్మగడ్డ పాఠశాల పోలింగ్ కేంద్రాల వద్ద అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఘర్షణ నెలకొంది. చేర్యాల ఎన్నికల చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఇరు పార్టీలకు చెందిన నాయకులు బాహాబాహీకి దిగిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. పట్టణంలోని బాలికల పాఠశాల పోలింగ్ కేంద్రంలో కొందరు అధికార పార్టీ నాయకులు లోపలికెళ్లి ప్రచారం చేస్తున్నారని తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు అక్కడికి వెళ్లి నిబంధనల మేరకు ప్రచారం చేయాలని సూచించారు. దీంతో కాంగ్రెస్ నాయకులు తమ ఇష్టమొచ్చినట్లు చేస్తామని సమాధానం ఇచ్చారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు వచ్చారు. కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే పల్లాతో పంచాయతీ చేయాలనే తలంపుతో అక్కడకు చేరుకుని బీఆర్ఎస్ నాయకులతో వాగ్వాదానికి దిగారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుకునే స్థాయికి చేరుకోవడంతో పలువురు జోక్యం చేసుకుని వారించే ప్రయత్నం చేసినప్పటికీ ఘర్షణ తగ్గుముఖం పట్టలేదు. అధికార కాంగ్రెస్ నాయకులు అంతటితో ఆగకుండా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గోబ్యాక్ అనే నినాదాలు చేయడంతో బీఆర్ఎస్ నాయకులు మాజీఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రం వద్ద ఘర్షణ జరుగుతున్న విషయం తెలుసుకున్న సీఐ శ్రీను, ఎస్ఐ దామోదర్ పోలీస్ సిబ్బందితో తరలి వచ్చి ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించేందుకు యత్నించినప్పటికీ నాయకులు ససేమిరా అన్నారు. ఎమ్మెల్యే పల్లా గోబ్యాక్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, నియోజవకర్గ ఎమ్మెల్యే హోదాలో కేంద్రానికి వస్తే కొందరు నాయకులు తాగి వచ్చి ఘర్షణ దిగి అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారని వారిని మొదటగా ఇక్కడ నుంచి పంపించాలని బీఆర్ఎస్ నాయకులు పట్టుబట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులపై అధికార పార్టీ నాయకులు చేస్తు న్న నినాదాలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసులు వారిని కట్టడి చేయడంలో తీవ్రంగా విఫలమయ్యారని విమర్శించారు. తమ వద్ద ఓటర్లు ఉన్నారని, వారి వద్ద క్వార్టర్లు ఉన్నాయని ఎద్దేవా చేశారు. సుమారు గంటపాటు జరిగిన వాగ్వాదం, తోపులాటను సద్దుమణిగించేందుకు సీఐ శ్రీను కృషి చేయడంతో ఇరువర్గాలు శాంతించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అంతకుముందుకు చేర్యాల పట్టణంలోని పెద్దమ్మగడ్డ పోలింగ్ కేంద్రంలోకి కాంగ్రెస్ జనగామ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి, ఆయన కుమారుడు రాకేశ్‌రెడ్డిలతో కలిసి గుంపుగా వెళ్లడంతో బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. చేర్యాల పట్టణంలోని జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద అధికార పార్టీ నాయకులు కుర్చీలు వేసుకుని ప్రచారం చేస్తుండడంతో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నేత అందె బీరన్న అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది.

# బీజేపీ కార్యకర్త అత్యుత్సాహం

- సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఓటేసిన వైనం
- అనంతరం వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేసిన యువకుడు
- ఓటర్లను ప్రభావితం చేసేలా వీడియో
- అధికారుల వైఫల్యంతోనే సెల్‌ఫోన్ తీసుకెళ్లాడని ఇతర పార్టీల ఆరోపణ



బ్రాహ్మణపల్లిలో సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఓటేస్తున్న బీజేపీ కార్యకర్త

నర్సాపూర్, మే 13: మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన బీజేపీ కార్యకర్త అత్యుత్సాహం ప్రదర్శించి పీకల మీదికి తెచ్చుకున్నాడు. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన మంగళి గణేశ్ ఓటు వేయడానికెళ్లి తనవెంట సెల్‌ఫోన్‌ను పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లాడు. ఓటు వేసేటప్పుడు మొఖం కనబడే విధంగా ఈవీఎంపై కమలం పువ్వుకు ఓటేస్తూ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. అనంతరం వాట్సాప్ గ్రూప్‌లో వీడియోను పోస్టు చేశాడు. ఈ వీడియో ఓటర్లను ప్రభావితం చేసేలా ఉందని, ఇతర పార్టీల నాయకులు ఆరోపించారు. ఈ ఘటన న్యూస్ ఛానల్‌లో రావడంతో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి దృష్టికి వెళ్లింది. దీంతో సంబంధిత వ్యక్తిని గుర్తించాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఆరా తీస్తున్నారు. పోలింగ్ అధికారుల వైఫల్యంతోనే యువకుడు సెల్‌ఫోన్ పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లాడని ఇతర పార్టీల నాయకులు ఆరోపించారు. ఈ విషయంపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు గణేశ్‌పై విచారణ చేపట్టామని, ఎఫ్ఐఆర్ నమోదు చేశామని వెల్లడించారు.



తెల్లాపూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి



మొగుడంపల్లి మండలం మాడ్గిలో ఓటు వేసిన జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్

# పోటెత్తిన ఓటర్లు

- మెదక్ పార్లమెంట్ పరిధిలో ప్రశాంతంగా పోలింగ్
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- దివ్యాంగులు, వృద్ధులకు సాయం
- ఓటేసిన ప్రముఖులు, యువకులు
- పటిష్ట బందోబస్తు నడుమ పోలింగ్
- సాయంత్రం 6 గంటల వరకు 73.63 శాతం నమోదు

మెదక్, మే 13 (నమస్తే తెలంగాణ): మెదక్ పార్లమెంట్ పరిధిలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 5.30 గంటలకు ఎన్నికల అధికారులు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఆ తర్వాత పోలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఉత్సాహంగా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించినట్టు ఫిర్యాదులు వచ్చాయి. సాంకేతిక సిబ్బంది వాటిని సరిచేశారు. కొన్ని ప్రాంతాల్లో మొరాయించిన ఈవీఎంల స్థానంలో కొత్త వాటిని అమర్చారు. మొత్తమ్మీద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9 గంటల వరకు 10.99 శాతం పోలింగ్ నమోదు కాగా, 11 గంటల వరకు 28.30శాతం నమోదైంది. మధ్యాహ్నం ఒంటిగంట వరకు 46.72శాతం నమోదు కాగా, 3 గంటల వరకు 60.94 శాతం నమోదైంది. సాయం త్రం 5 గంటల వరకు 71.33శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం 6 గంటల వరకు 73.63 శాతం నమోదైంది.

**ఓటేసిన అభ్యర్థులు, ప్రముఖులు**

తొలిసారి ఓటేసేందుకు భారీసంఖ్యలో యువత ఆసక్తి చూపారు. కొత్త దంపతులు, వృద్ధులు, దివ్యాంగులు సైతం పోలింగ్ స్టేషన్లకు వచ్చి ఓటేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి రామాయంపేట మండలం కోనాపూర్‌లో ఓటుహక్కును వినియోగించుకున్నారు. చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లిలో ఎమ్మెల్యే రోహిత్ దంపతులు ఓటేశారు. హవేళీఘనపూర్ మండలం కుచన్‌పల్లిలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఓటేశారు. శివ్వంపేట మండలం గోమారంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఓటేశారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి పాపన్నపేట మండలం యూసుఫ్‌పేటలో ఓటేశారు. నిజాంపేట మండలం కల్వకుంటలో బీఆర్ఎస్ నాయకుడు తిరుపతిరెడ్డి ఓటేశారు.

**పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు..**

మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఆయా నియోజకవర్గాల్లో ఈవీఎంలు మొరాయించాయి. సాంకేతిక సమస్యలు, సిబ్బంది అవగాహన లోపంతో నియోజకవర్గంలోని పలు చోట్ల ఈవీఎంలు, వీవీప్యాట్లు మొరాయించడంతో అక్కడక్కడ ప్రజలు, మహిళలు వేచి ఉన్నారు. మాసాయిపేట మండలకేంద్రంలోని 25వ పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు మొరాయించాయి. మెదక్ మండలం మక్తభూపతిపూర్‌లో అరగంటపాటు ఈవీఎంలు మొరాయించడంతో ప్రజలు క్యూలోనే నిల్చున్నారు.

**పటిష్ట బందోబస్తు...**

పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని మెదక్ జిల్లాలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు బలగాలతోపాటు సాయుధ బలగాలు పర్యవేక్షించాయి. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు, ప్రజలు నిలబడకుండా చర్యలు తీసుకున్నారు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట, వెల్దుర్తి మండల కేంద్రాల్లో జిల్లా ఎస్పీ బాలస్వామి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. నర్సాపూర్ మండలకేంద్రంలో పోలింగ్ కేంద్రాన్ని మల్టీ జోన్-1 ఐజీ రంగనాథ్ సందర్శించారు.

**మెదక్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం**

| అసెంబ్లీ సెగ్మెంట్ | 9 గం. | 11 గం.కు | 1 గం.కు | 3 గం.కు | 5 గం.కు | 6 గం.కు |
|---|---|---|---|---|---|---|
| సిద్దిపేట | 11.10 | 26.53 | 44.36 | 58.63 | 69.25 | 73.15 |
| మెదక్ | 12.00 | 32.54 | 53.17 | 67.6 | 76.82 | 79.61 |
| నర్సాపూర్ | 12.24 | 32.51 | 53.75 | 70.12 | 81.15 | 83.73 |
| సంగారెడ్డి | 10.14 | 26.51 | 44.25 | 58.31 | 68.48 | - |
| పటాన్‌చెరు | 9.15 | 23.97 | 38.61 | 49.44 | 58.94 | 61.00 |
| దుబ్బాక | 13.06 | 30.45 | 50.38 | 67.17 | 78.69 | 80.22 |
| గజ్వేల్ | 11.12 | 29.65 | 49.57 | 65.13 | 76.41 | 79.07 |



మెదక్ పట్టణంలో ఓటు వేయడానికి బారులుదీరిన మహిళలు